మార్పు కోసం...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL



విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి కేంద్రాలుగా నడుపబడుతున్న

మరో ఉదయం

(అక్రిడేషన్ కలిగి ఉన్న) తెలుగు దినపత్రికకు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంప్రదించండి

సెల్:9154842842



ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 203/ 11 గురువారం, జనవరి 2024 పేజీలు: 4/వెల రూ5/-


## సిఎం రేవంత్‌తో అమెజాన్ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్,జనవరి10(మరో ఉదయం):



2 లో

## కార్యకర్త కాలపై నుంచి కెకె కారు

హైదరాబాద్,జనవరి10(మరో ఉదయం):

బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయం 'తెలంగాణ భవన్' వద్ద ప్రమాదం జరిగింది. ఎంపీ కే.కేశవ రావు కారు ఓ కార్యకర్త కాలు పైనుంచి వెళ్లింది. భూపాలపల్లి నియోజకవర్గం చల్వూర్‌కు చెందిన శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి కాలుపై నుంచి వెళ్లడంతో అతడు గాయపడ్డాడు. ఈ ప్రమాదంపై బాధితుడు శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయితే ఎంపీ కేశవరావు వెంటనే స్పందించారు. కారు దిగి వచ్చి పరామర్శించారు. శ్రీనివాస్ రెడ్డిని చికిత్స కోసం తక్షణమే ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి బాధ్యుడైన కారు డ్రైవర్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కుప్పంలో బాబు.. హిందూపురంలో బాలయ్య ఔట్

ఇద్దరినీ ఓడించి వైకాపాను గెలిపిస్తాం

మంత్రి పెద్దిరెడ్డి వెల్లడి



2 లో

## నాంపల్లిలో పట్టాలు తప్పిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్

### పలువురికి గాయాలు..ఆస్పత్రికి తరలింపు

### పలు ఎంఎంటిఎస్ రైళ్ల రద్దు

హైదరాబాద్,జనవరి10(మరో ఉదయం):

హైదరాబాద్ నాంపల్లి రైల్వేస్టేషన్‌లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చిన రైలు నాంపల్లి స్టేషన్‌లో ఆగే క్రమంలో డెడ్ ఎండ్ గోడను ఢీకొట్టింది. దాంతో రైలులోని మూడు బోగీలు పట్టాలు తప్పి పక్కకు వెళ్లాయి. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.నాంపల్లి రైల్వేస్టేషన్‌లో జరిగిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంతో పలు ఎంఎంటీఎస్ రైళ్లు రద్దయ్యాయి. హైదరాబాద్ (నాంపల్లి) నుంచి మేడ్చెల్ (47244), మేడ్చల్ నుంచి హైదరాబాద్ (47251) ఎంఎంటీఎస్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంపై.. దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ రాకేష్ మాట్లాడుతూ.. ట్రైన్ డెడ్ ఎండ్‌ను ఢీకొట్టడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుందన్నారు. ఎస్ టూ, ఎస్ త్రీ, ఎస్ సిక్స్ బోగీలు ఈ ప్రమాదంలో పట్టాలు తప్పాయన్నారు. రైలు ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని.. ఇప్పుడే ప్రమాదానికి కారణాలు చెప్పలేమని అన్నారు. రైలు ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారని వారికి రైల్వే హాస్పిటల్‌లో చికిత్స కొనసాగుతోందని అన్నారు. ప్రయాణికులంతా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లోనే దిగిపోయారని రాకేష్ తెలిపారు. రైలు ప్రమాదంతో నాంపల్లికి వచ్చే పలు ఎంఎంటీఎస్ రైళ్ళను రద్దు చేశామన్నారు. రైలు ప్రమాదంపై కమిటీ దర్యాప్తు చేస్తోందన్నారు. పునరుద్ధరణ పనులు పూర్తి అవుతాయని రాకేష్ వెల్లడించారు.

## పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన

- తెలంగాణకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానం
- తొలిసారి అధికారికంగా రేవంత్ పర్యటన



హైదరాబాద్,జనవరి10 (మరో ఉదయం):

తెలంగాణలో అధికారం చేపట్టాక పాలనలో దూకుడు మొదలు పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి పారిశ్రామిక విధానంలోనూ కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహం ఉంటుందని ప్రకటించారు. అలాగే పెట్టుబడులపై దృష్టి సారించారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. పారిశ్రామిక, ఐటీ విధానాలపై కసరత్తు చేస్తున్నారు. పెట్టుబడులను ఆకర్షించే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి... దావోస్ పర్యటనకు వెళ్తున్నారు. దావోస్‌లో నిర్వహించనున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ కూడా సిఎంవో విడుదల చేసింది. ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఆయన పర్యటిస్తారు.

మిగతా 2 లో

## అంబటిరాయుడు కొత్త ఇన్నింగ్స్ జనసేనాని పవన్ కళ్యాణ్‌తో కలసి గేమ్

హైదరాబాద్,జనవరి10(మరో ఉదయం):

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో మాజీ క్రికెటర్ అంబటి రాయుడు భేటీ అయ్యారు. వైసీపీలో చేరిన వారం రోజులకే రాజీనామా ప్రకటించిన అంబటి రాయుడు కొంత కాలం రాజకీయాలకు విరామం తీసుకుంటానని చెప్పారు. అయితే హఠాత్తుగా ఆయన హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్‌తో సమావేశం అయ్యారు. వైసీపీకి రాజీనామా చేసిన తర్వాత ఆయన తనకు దుబాయ్‌లో లీగ్ లు ఉన్నాయని అందుకే రాజకీయాలకు విరామం ప్రకటించానని అన్నారు. కానీ అది అబద్ధమని పవన్ తో భేటీ ద్వారా క్లారిటీ వచ్చినట్లయింది. ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడానికంటే ముందు నుంచి వైసీపీతో రాయుడు టచ్‌లో ఉన్నాడు. ఆయన ఐపీఎల్‌లో ప్రాతినిధ్యం వహించిన ఇండియా సిమెంట్స్ ఓనర్ శ్రీనివాసన్‌తో సీఎం జగన్మోహన్ రెడ్డికి వ్యాపార సంబంధాలు ఉన్నాయి. ఈ సంబంధాల కారణంగా



రాయుడు వైసీపీ వైపు మొగ్గు చూపినట్లుగా చెప్పారు. ఆయనకు గుంటూరు ఎంపీ స్థానం ఇచ్చేందుకు సీఎం

మిగతా 2 లో

## రాహుల్ గాంధీకి మణిపూర్ ప్రభుత్వం షాక్

### న్యాయ యాత్రకు అనుమతి ఇవ్వలేమని వెల్లడి

న్యూఢిల్లీ,జనవరి10(మరో ఉదయం):

మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో జనవరి14 నుంచి ప్రారంభమయ్యే భారత్ జోడో న్యాయ్ యాత్రపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, యాత్రకు అనుమతి ఇవ్వలేమని మణిపూర్ ప్రభుత్వం స్పష్టం చేసింది. మణిపూర్ సర్కార్ నిర్ణయంపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. అయితే షెడ్యూల్ ప్రకారమే రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర కొనసాగుతుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇంఫాల్ లోని మరో ప్రాంతం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని వెల్లడించారు.





మిగతా 2 లో

## చంద్రబాబుకు హైకోర్టులో భారీ ఊరట

- రీజినల్ రింగ్ రోడ్డు, మద్యం, ఉచిత ఇసుక కేసుల్లో
- ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు
- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, విశ్రాంత ఐఏఎస్ శ్రీనరేష్‌కు బెయిల్

అమరావతి,జనవరి10 (మరో ఉదయం):

తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఏపీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. బుధవారం నాడు హైకోర్టులో చంద్రబాబుపై ఉన్న మూడు కేసులపై విచారణ జరిగింది. ఈ విచారణలో హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఒకేసారి మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రీజినల్ రింగ్ రోడ్డు, మద్యం, ఉచిత ఇసుక కేసులల్లో ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అలాగే మద్యం కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర,



మిగతా 2 లో

## ఢిల్లీ గుప్పిట నుంచి తెలంగాణను దక్కించుకోవాలి

- కాంగ్రెస్ హామీలను నెరవేర్చడం కష్టమే
- కష్టపడితేనే ఎంపి సీట్లను సాధించుకోగలం
- పార్టీ నిలవాలంటే మనమంతా గట్టిగా పనిచేయాలి
- వరంగల్ సమీక్షలో వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



2 లో

## అక్రమంగా చేరిన వారు వెళ్లిపోండి

- దొంగ ఉద్యోగులకు మంత్రి పొన్నం హెచ్చరిక
- కొత్త బస్సుల కొనుగోలుకు రంగం సిద్ధం

కరీంనగర్,జనవరి10(మరో ఉదయం):



జెన్ కో తోపాటు ఇతర డిపార్ట్ మెంట్ లో అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారు.. వెంటనే ఉద్యోగాలు వదిలిపెట్టి వెళ్ళాలని లేకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ అండ్ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చారించారు. బుధవారం జిల్లా పట్టణంలో మంత్రి మార్నింగ్ వాక్ చేస్తూ.. వాకర్స్ తో కలిసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణ జరిగితే బిఆర్ఎస్ నేతల్లో దడ పుడుతుందని.. రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు 9 నెలలు కూడా పనిచేయలేదని విమర్శించారు. ప్రాజెక్టు అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని చెప్పారు. బిఆర్ఎస్ ను కాపాడేందుకు బిజెపి నేతలు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చి నెలరోజులు అవుతుందని.. గ్యారెంటీ స్కీంలపై ధరఖాస్తులు స్వీకరించామని.. చిత్తశుద్ధితో వందశాతం అమలు చేస్తామని తెలిపారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ అంత సచ్చీలుడైతే.. తనపై వచ్చిన ఆరోపణపై పోలీసులకు ఫిర్యాదు చేసి.. తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. భూ అక్రమాలపై చర్యలు చేపడుతామని మంత్రి అన్నారు. ఇదిలావుంటే బస్సుల్లో మహిళల ఫ్రీ జర్నీకి పెరుగుతున్న రద్దీ కారణంగా 275 బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డిసెంబర్ లో 80 బస్సులు ప్రారంభించాం..ఇపుడు మరో 275 బస్సులు కొనుగోలు చేస్తున్నాం.. వీటికి అదనంగా జూలై చివరి నాటికి మరో 1000 కొత్త బస్సులు నడుపుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీని బలోపేతంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మహాలక్ష్మి పథకం అమలు చేశామని తెలిపారు. మహిళలకు ఫ్రీ జర్నీ పథకానికి మంచి రెస్పాన్స్ వస్తుందన్నారు. ఇప్పటి వరకు 9 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు.

మార్పు కోసం...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

## సంపాదకీయం

# క్షేత్రస్థాయి అధ్యయనంతోనే భూ సమస్యలకు చెక్ !

రోగం ఏమిటో తెలిస్తే...మందు వేయడం సులభం. అందుకే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మెల్లగా సమస్యలను గుర్తించి..పరిష్కరించే ప్రయత్నాలను మొదలు పెట్టింది. ధరణిలో భూ సమస్యల పరిష్కారం దిశగా ముందడుగు వేసింది. ధరణి పోర్టల్‌లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా... ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించింది. దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ధరణి పేరుతో భూముల రిజిస్ట్రేషన్ల లో జరిగిన అవక తవకలను కూడా ప్రభుత్వం వెలికితీయనుంది. అయితే ఇందులో పట్టా బూములు, అసైన్డ్ భూములు, దేవాదాయ భూములు, వక్ఫ్ భూములను కూడా గుర్తించాల్సి ఉంది. అలాగే బక్కరైతుల భూములను బలవంతంగా లక్కొని రిజిస్ట్రేషన్ చేసుకున్న భూములను కూడా కమిటీ గుర్తించాలి. ఇందు కోసం కొత్తగా ఏర్పడ్డ కమిటీ గ్రామాల వారీగా వివరాలు నమోదు చేయాలి. అన్యాయం అయిందన్న వారు దరఖాస్తులు చేసుకునే వెసులబాటు ఉండాలి. ధరణిలో ఎక్కినంత మాత్రాన తమకు ధోకా లేదన్న భావన లేకుండా చేయాలి. ధరణి స్థానంలో భూమాతను తీసుకొస్తామని కూడా ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించింది. ఈ క్రమంలో ముందుగా ధరణిలో సమస్యలను గుర్తించేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో పేరుకు పోయన భూ సమస్యలకు కారణమైన పోర్టల్‌లో మార్పులు చేర్పులు చేస్తే తప్ప పరిష్కారం సాధ్యంకాదని, రెవెన్యూ అకారులు కూడా ప్రభుత్వానికి ఇప్పటికే సూచించారు. పోర్టల్‌లో సాంకేతికంగా అనేక సమస్యలు ఉన్నాయని నివేదించారు. దీంతో ధరణి పోర్టల్‌లో సమస్యలను తొలగించి సరికొత్తగా రూపొందించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించడం ఓ మంచి అడుగుగా భావించాలి. చిత్తశుద్ధితో సమస్యలను అధ్యయనం చేసి పరిషఘ్కరించే దిశగా అడుగులు వేయాలి. క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించాలి. ఈ దిశగా ఐదుగురు సభ్యుల కమిటీ పనిచేయగలగాలి. సమాచారం తెప్పించు కుంటే.. అధ్యయనం చేయడం సులువు కాగలదు. కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం... తెలంగాణ ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది కనుక సమగ్ర అధ్యయనంతో ముందుకు సాగాలి. ధరణిపై వేసిన కమిటీలో కన్వీనర్‌తోపాటు నలుగురు సభ్యులను నియమించింది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్... నవీన్ మిత్తల్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. రైతుల సమస్యలపై పట్టున్న కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, మాజీ ఐఏఎస్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్‌గా పని చేసిన రేమండ్ పీటర్‌ను ఈ కమిటీలో సభ్యులుగా స్థానం కల్పించింది. భూ చట్టాల నిపుణుడు, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం అనుబంధ ఆచార్యుడు సునీల్, రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉన్న రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.మధుసూదన్‌ను కూడా ఈ కమిటీలో నియమించారు. ఈ కమిటీ... ధరణి పోర్టల్లోని సమస్యలను గుర్తించి.. వారికి పరిష్కారాలను కనుగొని ప్రభుత్వానికి నివేదిక అందించాల్సి ఉంది. వీలైనంత త్వరగా ఈ నివేదిక ఇవ్వాలని.. కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని భూ సమస్యలకు పరిష్కారం చూపేలా ఈ కమిటీ పనిచేయనుందని పేర్కొన్న దరిమిలా సమస్యలపై ఫిర్యాదలును కూడా స్వీకరించాలి. ఏ భూములు ఎలా అక్రమాలకు గురయ్యాయో సమాచారం కూడా తెప్పించుకోవాలి. అలాగే గత బిఆర్‌ఎస్ పెద్దలు అక్రమంగా ఆక్రమించుకున్న భూములపైనా విచారణ జరగాలి. చెరువుల శిఖాలను ఆక్రమించుకుని బహుళ అంతస్థులు కట్టుకున్న వారి చిట్టాలను కూడా తీయాలి. ప్రధానంగా హైదరాబాద్ లాంటి నగరంలో చెరువులు మాయం అయ్యాయి. చెరువు శిఖాలను మాయం చేశారు. ఇవన్నీ కూడా బయటపడాలి. అప్పుడే ధరణి సంస్కరణలకు అర్థం ఉంటుంది. ధరణి పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూములు దోచుకుందని కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా ప్రచారం చేసింది. అధికారంలోకి వస్తే... ధరణిని బంగాళాఖాతం వేస్తామని పదేపదే ప్రకటించింది. ధరణి పోర్టల్లో భూముల ఖాతాలు ఉన్న వారికే పట్టా పాసు పుస్తకాల జారీ చేస్తున్నారు. ధరణి వెలుపల 18 లక్షల మంది వరకు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. ధరణి పోర్టల్‌తో లక్షల్లో పెండింగ్ సమస్యలు ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది. వీటన్నింటిపై సమగ్రంగా అధ్యయనం చేసి పోర్టల్‌ను పునర్నిర్మించే బాధ్యతను కమిటీకి అప్పగించింది. కొత్త సమస్యలు తలెత్తకుండా... ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుకోవడంలో ఈ కమిటీ సమగ్రంగా పనిచేయాలి. ఇప్పటికే ధరణి పోర్టల్‌లో 33 మాడ్యూళ్లను అమల్లోకి తీసుకొచ్చినా... భూముల సమస్యలు పరిష్కారం కాలేదు. అందుకే భూమాత పోర్టల్ తీసుకురావడానికి ముందే... ఉన్న సమస్యలకు పరిష్కరించి.. అవి మళ్లీ తలెత్తకుండా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పట్టా భూములతో పాటు అన్ని రకాల భూముల సమస్యలను పరిష్కరించ గలిగేలా చూడాలి. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ జిల్లాల్లో పర్యటించి.. భూ సమస్యలపై అధ్యయనం చేయాలి. కమిటీకి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో సహకరించాలని ప్రభుత్వం సూచించింది. భూ సమస్యల మూలాలను కనుగొని... వాటి పరిష్కారాలపై అధ్యయనం చేసి వీలైనంత త్వరగా నివేదిక అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇకపోతే ప్రధానంగా దేవాదాయ, వక్ఫ్ భూములను కాజేశారు. ఇటీవలి భూసమగ్ర సర్వేలా జిల్లాల వారీగా దేవాదాయ భూమల గుర్తింపు స్వాధీనంపై తెలంగాణ దేవాదాయ శాఖ ప్రకటన చేయలేకపోయింది. ఏ గ్రామంలో ఎంత భూమి ఉందో గుర్తించిన దాఖలాలు లేవు. ఆయా గ్రామాల్లో కోట్ల విలువైన భూములు ఉన్నా వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదో చెప్పడం లేదు. అలాగే అర్చక సంఘాలు, బ్రాహ్మణ సంఘాలు కూడా క్షేత్రస్థాయి వివరాలను ప్రభుత్వానికి నివేదించినా పట్టించుకోలేదు. ఆలయ భూములు అన్యాక్రాంతం అయినా,ఆలయాల్లో ధూపదీప నైవేద్యం కరువైనా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గ్రామస్థాయిలో సర్పంచ్‌లు కూడా దేవాదాయ భూముల గురించి తెలిసినా పెద్దగా పట్టించుకోవడం లేదు. జిల్లా ఎండోమెంట్ అధికారులు కూడా ఇలాంటి వాటి జోలికి వెళ్లడం లేదు. అసిస్టెంట్ కమిషనర్లు ఉత్సవ విగ్రహాల్లో ఆలయ భూముల అన్యాక్రాంతాన్ని పట్టించుకోవడం లేదు. కోట్లాది రూపాయల విలువైన భూములను కాపాడే క్రమంలో తెలంగాణలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వెనక..కబ్జాల మోసం దాగివుంది. పదేళ్ల కెసిఆర్ పాలనలో కనీసం ఒక్క ఎకరా కూడా స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవు. గ్రామాల్లో మాన్యాలను మింగేసిన ఘనుల భరతం పట్టాలి. గుళ్ల పేరుతో ఉన్న ఆస్తులను కొందరు అక్రమార్కులు కబ్జా చేసుకున్నారు. ధరణిలో తమపేరుతో ఎక్కించే సుకున్నారు. ఇలా వేల ఎకరాల వరకు అన్యాక్రాంతం అయ్యాయి. వాటి విలువ ఇప్పుడు వేలకోట్లల్లో ఉంటుందని అంచనా. కనీసం ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి కౌలు చెల్లించే విధంగా వేలం కూడా నిర్వహించలేని దుస్థితి నెలకొంది. ఇలాంటి భూములను కూడా గుర్తించి స్వాధీనం చేసుకుని కబ్జాచెరకు విముక్తి కలిగించాలి.

# ఢిల్లీ గుప్పిట నుంచి తెలంగాణను దక్కించుకోవాలి

మొదటిపేజీ తరువాయి

**హైదరాబాద్,జనవరి10 (మరో ఉదయం):** ఢిల్లీ చేతుల్లోకి వెళ్లిన తెలంగాణను మళ్లీ మన గుప్పిట్లోకి తెచ్చుకోవాల్సి ఉందని, అందుకు పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడమే మార్గమని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. అందుకు మనమంతా కలసికట్టుగా కృషి చేయాల్సి ఉందన్నారు. కొన్ని తప్పిదాల వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఓటమి పాలయ్యాం. ఇప్పుడు ఢిల్లీ చేతుల్లోకి తెలంగాణ వెళ్ళింది. మన తెలంగాణ మన చేతుల్లోకి తెచ్చుకునే సమయం ఆసన్నమైంది. రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోండి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. తెలంగాణ గళం, బలం ఢిల్లీలో వినిపించాలంటే మనం రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాల్సిన అవసరం ఉందని కెటిఆర్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ సమీక్ష సమావేశం 8వ రోజు తిరిగి ప్రారంభమైంది. వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, కడియం శ్రీహరి,పోచారం శ్రీనివాస రెడ్డి, మధు సుధనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, రావుల చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు.సమావేశానికి లేటుగా మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ వచ్చారు. ఈ క్రమంలోనే వినయ్ భాస్కర్‌కు కేటీఆర్ చురకలు అంటించారు. అసెంబ్లీకీ లేటే, మీటింగ్‌కు లేటేనా అని ప్రశ్నించారు. ఇక ఈ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ..రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ సమావేశాలు నిర్వహిస్తున్నాము. తల్లడిల్లి ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 10 ఏళ్ల పాటు చల్లగా కాపాడుకున్నాం. ఇప్పుడు మళ్లీ మనం పట్టు సాధిస్తేనే మనగలుగుతామని అన్నారు. స్వల్పకాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే లక్షణం కాంగ్రెస్ పార్టీ సొంతమని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆ పార్టీ గత చరిత్రను పరిశీలిస్తే అర్థమయ్యేది అదేనని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి గల కారణాలను లోతుగా విశ్లేషించారు. లోటుపాట్లు సవరించుకుంటే భవిష్యత్తు అంతా బీఆర్‌ఎస్‌దేనని చెప్పారు. వాగ్దానాలను నిలుపుకునే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు ఉండదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై నెలదాటింది. అధికారంలోకి వచ్చిన తెల్లారినుంచే హామీలను అమలు చేస్తామని ప్రకటించిన ఆ పార్టీ.. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా కాలాయపన చేస్తున్నది. కాంగ్రెస్ నెల రోజుల పాలనా పోకడలే అందుకు సాక్ష్యం. ప్రభుత్వ తీరుతో ప్రజల్లో అప్పుడే అసహనం ప్రారంభమైంది. హామీల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ మీద ఒత్తిడి తెస్తూ రాష్ట్ర ప్రజల కోసం బీఆర్‌ఎస్ పార్టీ పోరాడుతుంది. ఆ దిశగా బీఆర్‌ఎస్ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు.( పతిపక్షంలో ఉంటేనే మరింత పోరాట పటిమ చూపగలమని కేటీఆర్ అన్నారు. ఉద్యమంలో గట్టిగా పోరాడిన చరిత్రను గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అధికారంలో ఉండటం కన్నా ప్రతిపక్షంలో ఉండటమే కాంగ్రెస్ పార్టీకి ప్రమాదకరమని చెప్పారు. రెండుమూడు నెలలకోసారి అన్ని స్థాయిల కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు రాజకీయ అస్థిత్వంగా నిలిచిన బీఆర్‌ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను గెలిపించిందని కేటీఆర్ పేర్కొన్నారు. పదేండ్ల అనతికాలం లోనే తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. 'తెలంగాణ గళం బీఆర్‌ఎస్. తెలంగాణ బలమూ బీఆర్‌ఎస్సే. బీఆర్‌ఎస్ వేయబోయే ప్రతి అడుగులో కేసీఆర్ దళంగా ఐకమత్యంగా ముందుకు సాగుదాం. తెలంగాణ సాధించిన ఘనతకు, వెలుగొందుతున్న ప్రభకు ఏమాత్రం భంగం కలిగించకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్ శ్రేణులపై ఉన్నది. ఉద్యమ స్ఫూర్తిని, నిన్నటిదాకా సాధించిన ప్రగతిని తిరిగి నిలబెట్టుకుందాం. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించుకుందాం' అని పిలపునిచ్చారు.

# రాహుల్ గాంధీకి మణిపూర్ ప్రభుత్వం షాక్

మొదటిపేజీ తరువాయి

భారత్ జోడో యాత్ర విజయవంతం కావడంతో మణిపూర్‌లో ప్రారంభమై ముంబైలో ముగియనున్న 'భారత్ జోడో న్యాయ యాత్ర' చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే ఈ యాత్ర ప్రారంభం కాకముందే కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వాస్తవానికి, యాత్ర ఎక్కడ నుండి ప్రారంభించాలో మణిపూర్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడానికి నిరాకరించింది. ఈ యాత్ర జనవరి 14 నుంచి ప్రారంభం కానుంది. కానీ ఇప్పటికీ అనుమతి లేకపోవడంతో ప్రయాణం ప్రమాదంలో పడింది. మణిపూర్ ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. ఇది రాజకీయ ప్రయత్నం కాదని, యాత్రను రాజకీయం చేయవద్దని ఆయన అన్నారు. మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కె మేఘచంద్ర, పార్టీ నేతల బృందంతో కలిసి బుధవారం ఉదయం ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్‌ను కలిశారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని సాకుగా చూపుతూ భేటీ సందర్భంగా సీఎం అనుమతి నిరాకరించారని అన్నారు. ఇదిలావుంటే మణిపూర్ నుంచి ముంబై వరకు 6,500 కిలోమీటర్ల మేర సాగే ఈ చారిత్రాత్మక యాత్ర యువత, మహిళలు, రైతులు, పేదలకు న్యాయం చేయాలని కోరుతున్నట్లు కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ తెలిపారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో మణిపూర్‌లోని ఇంఫాల్‌లో ప్రారంభమయ్యే ఈ యాత్ర దేశంలోని 15 రాష్ట్రాల గుండా ముంబయిలో ముగుస్తుంది. ఇప్పుడు ఈ యాత్ర మార్గంలో అరుణాచల్ ప్రదేశ్ కూడా చేర్చారు.

# అంబటిరాయుడు కొత్త ఇన్నింగ్స్

మొదటిపేజీ తరువాయి

జగన్ నిర్ణయించారని.. అందుకే పార్టీలో చేర్చుకున్నారని ప్రచారం జరిగింది. గుంటూరు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. జగన్ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. కానీ హఠాత్తుగా పార్టీకి రాజీనామా చేశారు. ఆయన జనసేనలో చేరేందుకు ఇప్పుడు ప్రయత్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. క్షేత్ర స్థాయిలో పర్యటించిన సమయంలో ఆయన ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ఉంటారని.. టీడీపీ జనసేన కూటమికి విజయావకాశాలు ఉంటాయన్న ఉద్దేశంతో ఆయన వైసీపీక రాజీనామా చేసినట్లుగా భావిస్తున్నారు. అంబటి రాయుడు కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో.. జనసేనతో అయితే సర్దుకుపోగలరన్న అంచనాకు వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు. పవన్ తో అంబటి రాయుడు సమావేశం వివరాలు పూర్తిగా వెల్లడయిన తర్వాత అంబటి రాయుడు రాజకీయ భవిష్యత్ పై తీసుకునే నిర్ణయాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అంబటి రాయుడు క్రికెటర్ కావడంతో ఆయనను ఎక్కడ నిలబెట్టినా గెలుస్తారన్న అభిప్రాయంలో ఉన్నారు. ఆయన స్వస్థలం పొన్నూరు అయినప్పటికీ.. తాతల కాలంలోనే హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.టీడీపీ, జనసేన కూటమిలో భాగంగా లభించే ఏదో ఓ స్థానంలో ఆయనను పోటీ చేయించే అవకాశం ఉండొచ్చు. జనసేన వైపు నుంచి కానీ.. అంబటి రాయుడు వైపు నుంచి కానీ ఇంకా ఎలాంటి స్పందనా ఈ అంశంపై రాలేదు.

మొదటిపేజీ తరువాయి

# చంద్రబాబుకు హైకోర్టులో భారీ ఊరట

విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనరేష్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. చంద్రబాబు తరపున సీనియర్ కౌన్సిల్స్ సిద్దార్థ లూథ్ర.. దమ్మాలపాటి శ్రీనివాస్, పోసాని వెంకటేశ్వర్లు హైకోర్టులో వాదనలు వినిపించారు. ఐఆర్ఆర్, మద్యం, ఇసుక కేసుల్లో చంద్రబాబు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపి ఈ మేరకు నిర్ణయం ప్రకటించారు.ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేసిన తర్వాత.. మరికొన్ని కేసులు తెరపైకి వచ్చాయి.. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు, మద్యం కేసు, ఇసుక కేసు.. ఇలా పలు కేసుల్లో సీఐడీ వరుసగా కేసులు నమోదు చేసింది.ఈ మూడు కేసుల్లో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మొదట మధ్యంతర బెయిల్ పొందిన చంద్రబాబుకు ఆ తర్వాత రెగ్యులర్ బెయిల్ కూడా మంజూరు చేసింది. ఇక, ఐఆర్ఆర్, మద్యం కేసు, ఇసుక కేసుల్లో చంద్రబాబుపై సీఐడీ కేసులు నమోదు చేయగా.. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు.. ఈ కేసుల్లో విచారణ పూర్తి చేసి తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ పై గతంలో హైకోర్టు విచారణ జరిపి తిరస్కరించింది. కేసు విచారణ కీలక దశలో ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వలేమని చెప్పింది. దీనిపై సుప్రీంకోర్టులో చంద్రబాబు పిటిషన్ దాఖలు చేశారు. అయితే క్వాష్ పిటిషన్ పై తీర్పు ఇవవాల్సి ఉన్నందున విచారణ జరగడం లేదు. కానీ ఆ కేసులో అరెస్టులు చేయవద్దని స్పష్టం చేసింది. సీఐడీ తనపై నమోదు చేసిన కేసులు పూర్తిగా కుట్ర పూరితమని ..ఒక్క సాక్ష్యం లేకండా.. తప్పుడు ఆరోపణతో కేసులు నమోదు చేశారని చంద్రబాబు ఆరోపిస్తున్నారు. తనపై కేసులు నమోదు చేయాలంటే ముందుగా గవర్నర్ అనుమతి తీసుకోవాలని తనకు సెక్షన్ 17ఏ వర్తిస్తుందని.. చంద్రబాబు సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. సుదీర్ఘ వాదనలు జరిగిన తర్వాత క్వాష్ పిటిషన్ పై తీర్పును సుప్రీం కోర్టు రిజర్వ్ చేసింది. చంద్రబాబు తరఫున సీనియర్ అడ్వకేట్ హరీశ్ సాల్వే, ఏపీ సర్కార్ తరఫున సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. అక్టోబర్ 18వ తేదీన ఈ క్వాష్ పిటిషన్ తీర్పు రిజర్వ్ చేశారు. ఇంత కాలం తీర్పు వెల్లడించలేదు. ఎప్పుడు వెల్లడిస్తారో స్పష్టత లేదు.ఈ లోపు చంద్రబాబుకు హైకోర్టులో ఊరట లభించింది.

మొదటిపేజీ తరువాయి

# సిఎం రేవంత్‌తో అమెజాన్ ప్రతినిధుల భేటీ

**హైదరాబాద్,జనవరి10(మరో ఉదయం):** డా.బీఆర్‌ఎస్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో అమెజాన్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ భేటీలో తెలంగాణలో పెట్టుబడులపై అమెజాన్ ప్రతినిధులు సిఎం రేవంత్ రెడ్డికి వివరించారు.

# పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన

మొదటిపేజీ తరువాయి

వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సుకు ఆయన హాజరుకానున్నారు. దావోస్‌లో నిర్వహించనున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు ప్రముఖ గ్లోబల్ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో రేవంత్ సమావేశం కానున్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం వల్ల కలిగే అవకాశాలు, ప్రయోజనాల గురించి వారికి వివరించ నున్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. దావోస్‌లో ప్రతి ఏడాది ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతుంది. వివిధ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు, మల్టీ నేషనల్ కంపెనీల అధినేతలు, పెట్టుబడిదారులు హాజరవుతుంటారు. భారత్ నుంచి ముఖేష్ అంబానీ, ఆనంద్ మహీంద్ర, కుమార మంగళం బిర్లా, గౌతమ్ అదాని.. వంటి పారిశ్రామికవేత్తలు ఈ సదస్సుకు క్రమం తప్పకుండా హాజరవుతుంటారు. కేంద్రమంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ సదస్సులో పాల్గొంటుంటారు. తమ రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకుని రావడానికి ప్రయత్నాలు సాగిస్తుంటారు. ఈ ఏడాది తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో దావోస్‌లో జరగనున్న సదస్సుకు రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెళ్లనున్నారు. వాళ్లతోపాటు ముఖ్యమంత్రి కార్యదర్శి వి.శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పెట్టుబడుల వ్యవహారాల విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, మీడియా ప్రతినిధి కర్రి శ్రీరామ్, ముఖ్య భద్రతాధికారి తస్వీర్ ఇక్బాల్, ఉదయ సింహా, గుమ్మి చక్రవర్తి వెళు న్నారు. దావోస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే చర్చల్లో తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడంపై అంతర్జాతీయ వ్యాపార సంస్థల ప్రతినిధులతో మాట్లాడనున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. గత ఏడాది జనవరి మూడో వారంలో చివరి డబ్ల్యూఈఎఫ్ పర్యటన జరగగా... అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలోని బృందం హాజరైంది. ఆ సమయంలో..కేటీఆర్ సుమారు రూ.21వేల కోట్ల పెట్టుబడులను పొందినట్లు సమాచారం. ఈ ఏడాది తెలంగాణలో విదేశీ కంపెనీలు పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం చర్చలు జరపనుంది. విదేశీ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, సౌకర్యాలను ఈ బృందం వివిధ కంపెనీల ప్రతినిధులకు వివరించనుంది. ఐటీ, ఫార్మా, బయో, ఏరోస్పేస్, మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాల్లో అవలంబిస్తున్న విధానాలు, విదేశీ పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యత వంటి అంశాల గురించి వివరించనున్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

# కుప్పంలో బాబు..హిందూపురంలో బాలయ్య ఔట్

## ఇద్దరినీ ఓడించి వైకాపాను గెలిపిస్తాం-మంత్రి పెద్దిరెడ్డి వెల్లడి

**శ్రీ సత్యసాయి జిల్లా,జనవరి10(మరో ఉదయం):** కుప్పంలో బాబును, హిందూపురంలో బాలకృష్ణను ఓడిస్తామని అక్కడ వైసీపీ బోణీ కొట్టడం ఖాయమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం నాడు హిందూపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ...స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పెద్దగా సమస్యలపై దృష్టి సారించలేదు. రెండు సార్లు బాలకృష్ణ ఇక్కడ శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. కుప్పం, హిందూపూర్ రాష్ట్రంలో మిగిలిన నియోజకవర్గాలాగానే సాధారణంగా ఉంటుంది. అన్ని సర్వేలు మాకు అనుకూలంగా ఉన్నాయి. కుప్పంలో ఓడిపోతానని టీడీపీ అధినేత చంద్రబాబు మరో నియోజకవర్గం వెతుక్కుంటున్నారు. ఒకవేళ మరో దగ్గర పోటీ చేస్తే అయన ఓటమి అంగీకరించినట్టే. జగన్‌మోహన్‌రెడ్డి లాంటి నాయకుడు టికెట్ ఇస్తే ఊరికే గెలుస్తాం అన్న నమ్మకం ఉంది. అందుకే అనేక మంది టికెట్ కోసం అశ పడుతున్నారు. ప్రజలందరూ ఆయన్ని నమ్ముతారు కాబట్టి సీటు కోసం తాపత్రయపడడం సహజం. టీడీపీకి అభ్యర్థులు లేక... మేము టికెట్ నిరాకరిస్తే ఆ పార్టీ వైపు చూస్తున్నారు. కొన్ని పరిస్థితులు వల్ల ఇక్బాల్‌ను పోటీ నుంచి పక్కకి పెట్టాల్సి వచ్చింది. గోరంట్ల మాధవ్‌కు పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుంది. తెలంగాణ తరహాలో ఏపీలో కాంగ్రెస్ లేదు... ఏపీలో డిపాజిట్ లేని పార్టీ కాంగ్రెస్. నాయకులను మార్చినా కాంగ్రెస్ పార్టీ ఏపీలో కోలుకునే పరిస్థితి లేదు' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గతంలో అనంతపురంలో ఓడిపోతాం అన్నారు... కానీ అభ్యర్థులు మార్పు తర్వాత దాదాపు అన్ని స్థానాలు గెలుస్తాం అని అంటున్నారు. మేము ఎక్కడా సచివాలయం సిబ్బందిని ఎన్నికల కోసం వినియోగించలేదు. జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమ ద్రోహా? లేదా చంద్రబాబా అనేది రాజకీయాల్లో ఉన్న అందరికీ తెలుసు. 7 సార్లు ఎమ్మెల్యేగా ఉండి కుప్పంకు చంద్రబాబు నీళ్లు ఇవ్వలేదు. కుప్పంను రెవెన్యూ డివిజన్ చేయాలని చంద్రబాబు లేఖ రాస్తే జగన్ మంచి మనస్సుతో అది నెరవేర్చారు. అనంతపురంలో శాసనసభ్యులు అక్రమంగా నీరు తీసుకుంటున్న కూడా ఎక్కడా మనం ప్రశ్నించలేదు. చిత్తూరు, కడప జిల్లాలకు రావాల్సిన నీటి వాటా ఒక్కసారి కూడా మాకు అందలేదు. శింగనమల ఎమ్మెల్యే మాటలు ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నాను. హిందూపూర్‌లో వర్గ విభేధాలు ఉండవు. కుప్పం, హిందూపురం టీడీపీ కంచుకోటలు కాదు... అవి పగలడం ఖాయం' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు.

-------

మరో ఉదయం

# పక్కా టైటిల్ డీడ్ కోసం యత్నం

## ▪ నీతి ఆయోగ్ సూచనలతోనే సర్వేలు

## ▪ ఎపి ప్రభుత్వం చర్యలను సమర్థించిన మంత్రి

**అమరావతి,జనవరి10**

**(మరో ఉదయం):**

దేశ వ్యాప్తంగా టైటిలింగ్ యాక్ట్ తీసుకురావాలని ప్లానింగ్ కమిషన్, కేంద్ర ప్రభుత్వం 30 ఏళ్లుగా అధ్యయనం చేస్తోందని ప్రభుత్వం తెలిపింది. శిస్తు వసూలు చేసుకోవడానికి 1బీ, అడంగల్ వంటివి మత్రమే తెచ్చారని మంత్రి ధర్మాన ప్రసాద రావు తెలిపారు. టైటిలింగ్ గ్యారెంటీ చట్టాన్ని తీసుకు రావాలని, అన్ని రాష్ట్రాలకు నీతి ఆయోగ్ సూచించిందని అన్నారు. నీతి ఆయోగ్ సూచనలమేరకు 2019లోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రపతికి పంపారని తెలిపారు. దేశంలోనే సివిల్ కోర్టుల్లోని వివాదాల్లో 66శాతం భూములకు సంబంధించిందేనని చెప్పారు. ఆ 66 శాతంలో లక్ష ఆదాయంలోపు ఉన్నవారి కేసులో 90 శాతం ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్సీఆర్బీ రికార్డుల ప్రకారం 60 శాతం హత్యలు భూ వివాదాలు వల్ల జరుగుతున్నాయని అన్నారు. దేశ ప్రజల క్షేమం కోసం ఒక ప్రయత్నం జరుగుతుందని, 17 వేల గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల అప్డేషన్, సర్వే జరుగుతున్నాయని చెప్పారు. ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగిస్తున్నామని, వివాదాలు లేని రికార్డులు తయారవుతాయని చెప్పారు. వచ్చి ఏపీలో జరుగుతున్న సర్వే గురించి తెలుసుకుంటున్నారని అన్నారు. రికార్డులన్నీ అప్ డేట్ అయ్యాక, సర్వే పూర్తయ్యాక చట్టం నోటిఫై చేస్తామని చెప్పారు. ఇదంతా అయ్యేందుకు కొన్ని నెలల సమయం పడుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం భూహక్కుల చట్టం అమలులోకి వచ్చే విధంగా జీవో నెంబర్ 572 విడుదల చేసింది. ఈ చట్టం వల్ల రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని రైతులకు సమగ్ర హక్కుల రికార్డు తయారవుతుందని చెప్తున్నది. కేంద్ర ప్రభుత్వ అజమాయిషీ లోని నీతి ఆయోగ్ ఈ చట్టాన్ని ప్రతిపాదించింది. మోడల్ ల్యాండ్ టైటిల్ యాక్ట్ రూపొందించింది. అన్ని రాష్ట్రాలు చట్టాలు చేయాలని కోరింది. రాష్ట్ర స్థాయిలో ఐదుగురు సభ్యులతో భూప్రాధికార సంస్థ ఏర్పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 630 జీవో ద్వారా భూ ప్రాధికార సంస్థను నియమించింది. సిసిఎల్ఎ ఛైర్మన్‌గాను, సర్వీస్ సెటిల్‌మెంట్ కమిషనర్‌ను ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ గాను, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కమిషనర్, పంచాయతీరాజ్ కమిషనర్ సభ్యులుగా భూ ప్రాధికార సంస్థను ఏర్పరిచింది. ఈ సంస్థకు చట్టం రెండు కర్తవ్యాలను నిర్దేశించింది. స్థిర చరాస్తులను సంపాదించడానికి కలిగి ఉండడానికి, ఆస్తికి మార్కెట్‌ను సృష్టించి వ్యయం చేయడానికి దావా వేయడానికి అవకాశం ఇచ్చింది. దస్తావేజులకు, లైసెన్సులకు సంబంధించిన సమాచారం కోసం ఫీజులు నిర్ణయించి వసూలు చేయడం, ప్రభుత్వం నుండి లేదా సంస్థల నుండి సహాయం, గ్రాంట్లు, దానాలు, చందాలను, బహుమతులను, ధర్మాదాయములను స్వీకరించవచ్చని స్పష్టంగా పేర్కొంది. ఈ చట్టం ప్రకారం భూక్రయ విక్రయాలపైన, కట్టడాల పైన, లైసెన్సులపైన ఫీజులు పెంచడం, వసూలు చేయడం, ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు వాటాలు పంచడం చేస్తుంది. ఇప్పటికే ఆస్తులు విలువలు పెంచడం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం వల్ల సన్న, చిన్నకారు రైతాంగం పేద మధ్యతరగతి గృహ, స్థల యజమానులు భరించలేనంతగా ఉన్నాయి. ప్రభుత్వ భూములను, ప్రైవేటు భూములను సమీకరించడం వాటిని కార్పొరేట్ కంపెనీలకు, రియల్టర్లకు అమ్మే అధికారం పొందింది. అందుకు అనుగుణంగానే ఈ చట్టం ఆమోదించిన వెంటనే రాష్ట్రంలో 15 లక్షల 56 వేల మంది దగ్గరున్న 26 లక్షల ఎకరాల బంజరు భూములపై ఉన్న నిషేధాన్ని 35వ నెంబర్ జీవో ద్వారా ఎత్తివేసింది. ఇటీవల కాలంలో షరతులతో దళితులకు, గిరిజనులకు ఇచ్చిన బీ ఫారం భూములను సైతం భూ ప్రాధికార సంస్థ స్వాధీనం చేసుకునే అవకాశం కలిగింది. సహాయం, దానములు, చందాలు, బహుమతులు ఇవ్వగలిగిన కార్పొరేట్ కంపెనీలకు పేదల భూములు గుంజుకోవడానికి రాజమార్గం ఏర్పడింది. గతంలోని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులకు, రైల్వే లైన్‌లకు 500 మీటర్ల వరకు గల భూములలో నిర్మాణాలకు నిషేధం విధించింది. కోస్టల్ రెగ్యులేటెడ్ జోన్ పరిధిని మరొక 500 మీటర్లకు పెంచింది. అనంతపురం అమరావతి జాతీయ రహదారి ప్లానులో అవసరమైన దానికన్నా వెడల్పును రహదారుల జంక్షన్లలో అదనపు భూములను తీసుకోవడానికి నోటిఫికేషన్ కూడా ఇచ్చిన విషయం విదితమే. కార్పొరేట్ కంపెనీలకు గిడ్డంగుల నిర్మాణానికి, వ్యాపార కారిడార్లు ఏర్పరచుకోవడానికి ఈ చట్టం బాగా ఉపకరిస్తుంది. భూ ప్రాధికార సంస్థకు అధికారాన్ని కట్టబెట్టడం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమేననడంలో ఎటువంటి సందేహం లేదు. అందుకే ఈ భూ హక్కుల చట్టం రద్దుకు పోరాడవలసి ఉంది. రాష్ట్రంలో గత రెండు సంవత్సరాల నుండి భూముల సర్వే కార్యక్రమం జరుగుతుంది. సర్వేయర్ల ద్వారా కాకుండా డ్రోన్ల ద్వారా సర్వే జరుగుతుంది. వ్యవసాయ భూములతో పాటు గ్రామ కంఠాలు, మంద బయళ్ళు, తదితర భూములన్ని సర్వే చేస్తున్నారు. ఈ సర్వేను పరిశీలిస్తే సరిహద్దులు సక్రమంగా రావడం లేదని వాస్తవ విస్తీర్ణానికి, డ్రోన్‌లు చూపిస్తున్న విస్తీర్ణానికి పొంతన ఉండడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. సర్వే పూర్తయిన గ్రామాలలో పట్టాదారు పుస్తకాలు ఇస్తున్నారు. ల్యాండ్ పార్సిల్‌లో ఉన్న రైతులందరికీ జాయింట్ పట్టాలు ఇస్తున్నారని, క్రయ విక్రయాలకు బ్యాంక్ తనఖాలకు అందరి ఆమోదం కావాలన్న షరతు ఉన్నదని విమర్శలు వచ్చాయి. భూమి రిజిస్ట్రేషన్ అధికారిగా స్థానిక ఎమ్మార్వో ఉండాలి. సంచార మొబైల్ ఎమ్మార్వోగా మరొకరిని నియమించారు. భూ సర్వే పూర్తయిన క్రమంలో గ్రామాలలో రిజిస్ట్రేషన్ అధికారి రికార్డులలో నమోదు చేయాలి. భూమి కలిగిన యజమాని నివాస గృహం లేదా స్థలం కలిగిన యజమాని తమకు ఉన్న హక్కు పత్రాలను రిజిస్ట్రేషన్ అధికారికి అందించాలి. అన్నీ సక్రమంగా ఉంటే నమోదు చేస్తారు. కోర్టు లిటిగేషన్ ఉన్నా, సరిహద్దు వివాదం ఉన్నా, దాయాదుల తగాదాలు ఉన్నా రిజిస్ట్రేషన్ అధికారికి రాతపూర్వకంగా ఇవ్వాలి. ఈ లిటిగేషన్లన్నీ రిజిస్టర్‌లో నమోదు చేసి అప్పిలేట్ అధికారికి తెలియజేస్తారు. రైతుకు పట్టాదారు పాసు పుస్తకం ఇచ్చినా రిజిస్ట్రేషన్ అధికారి దగ్గర డిజిటలైజ్ చేసినదే అధికారయుతంగా ఉంటుంది. ఇది మార్పు చేసే అవకాశం ఉంటుంది. ఇది రైతుకు ఏ మాత్రం క్షేమకరం కాదు. రైతుకు ఇచ్చిన పట్టాదారు పాసు పుస్తకం అధికార పత్రంగా ఉండాలి. రికార్డు అయిన రెండు సంవత్సరాల లోపల ఎవరైనా అప్పీలు అధికారికి అభ్యంతరం దాఖలు చేయవచ్చు. నిరూపణ అయ్యేవరకు పెండింగ్‌లో ఉంటుంది. చట్టంలోని 64వ క్లాజు ప్రకారం నిరూపించుకోలేకపోతే ఆ రైతుకు లేదా స్థల యజమానికి ఆరు మాసాల జైలు, రూ.50 వేలు జరిమానా విధించవచ్చు. జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ హోదాకు తగ్గని అధికారిని అప్పిలేటు అధికారిగా నియమిస్తారు. రిజిస్ట్రేషన్ అధికారుల నుండి వచ్చిన, నేరుగా రైతులు లేదా ఇతరుల నుండి వచ్చిన ఫిర్యాదులను ఈ అధికారి విచారించి తీర్పు వెలువరుస్తారు. రెండు సంవత్సరాల వ్యవధిలో తీర్పులు ఇవ్వాలి. అప్పిలేట్ అధికారి ఇచ్చిన తీర్పు అంగీకారం కాకపోతే హైకోర్టుకు వెళ్ళాలి. జూనియర్, సీనియర్ సివిల్ కోర్టులకు, జిల్లా కోర్టులకు వెళ్ళకూడదు. సివిల్ కోర్టులు, జిల్లా కోర్టులు కలుగజేసుకోకూడదు. సన్న చిన్నకారు రైతాంగం హైకోర్టు దాకా వెళ్లలేరు. వెళ్లినా భూ మాఫియా ముందు నిలువలేరు. రైతాంగానికి న్యాయం అందని ద్రాక్షపండే అవుతుంది. భారత రాజ్యాంగంలోని నాలుగు మూల స్తంభాలలో న్యాయస్థానం ఒకటి తమకు అన్యాయం జరిగినప్పుడు కోర్టును ఆశ్రయించడం ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు సామాన్య ప్రజానీకానికి ?అందుబాటులో ఉండే డివిజనల్, జిల్లా న్యాయస్థానాలకు వెళ్లకుండా ఆంక్షలు విధించడం రాజ్యాంగ విరుద్ధం.

# ఊరు వెళ్తున్నారా..? అయితే జాగ్రత్త!

## నివారణకు పోలీసుల సూచనలు తప్పకుండ పాటించండి

**మరో ఉదయం న్యూస్:**

రాష్ట్రాల్లో మకర సంక్రాతి వేడుకలు మొదలయ్యింది. మరో మూడు నాలుగు రోజులు తమ సొంత గ్రామాల్లో గడిపేందుకు హైదరాబాద్ నుంచి తమ ఊళ్లకు వెళ్తున్నారు. మకర సంక్రాతి పండుగను తమ గ్రామాల్లో కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా జరుపుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. అయితే ఊళ్లకు వెళ్తున్న వారు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. మకర సంక్రాతి పండుగ సెలవులలో దొంగతనముల నివారణకై సైబరాబాద్ పోలీసుల వారి ముఖ్య సూచనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఊరు వెళ్లాల్సి వస్తే మీ విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్ల లో భద్రపర్చుకోండి లేనిచో మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలని తెలియజేసారు. సెలవులలో బయటకు వెలుతున్నప్పుడు సెక్యూరిటి అలారం, మోషన్ సెన్సర్ ను ఏర్పాటుచేసుకోవడం మంచిందని తెలిపారు. మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ గల తాళము అమర్చుకునడం మంచిదన్నారు. తాళము వేసి ఊరికి వెళ్లవల్సి వస్తే స్థానిక పోలీసు స్టేషన్ లో సమాచారము ఇవ్వాలని, మీ కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని, లేదా 100 నంబర్ కు తప్పనిసరిగ ఫోన్ చేయాలన్నారు. మీ వాహనాలను మీ ఇంటి ఆవరణ లోనే పార్కు చేసుకోవాలని, మీ ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేసి, మీకు వీలైతే చక్రాలకు చైన్స్ తో కూడా లాక్ వెయ్యడం మంచిదని తెలిపారు. నమ్మకమైన వాచ్ మెన్ లను మాత్రమే సెక్యూరిటీ గార్డులుగా నియమించుకోవాలని సూచించారు. మీ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరా లను ఆన్లైన్ లో ఎప్పటికప్పుడు చూసుకొంటూ వుండాలన్నారు. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలని, వాటిని కూడా గమనించి నేరస్తులు దొంగతనాలకు పాల్పడుతారన్న విషయాన్ని గమనించాలని అన్నారు. మెయిన్ డోర్ కి తాళం కప్ప వేసినప్పటికి అవి కనిపించకుండా కర్టెన్స్ తో కవర్ చేయడం మంచిదని పేర్కొన్నారు. బయటకు వెళ్ళేటప్పుడు ఇంటి లోపల, బయట కూడా కనీసం కొన్ని లైట్లు వేసివుంటే మంచిదన్నారు. మీ ఇంటి దగ్గర గల మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్ళకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తు ఉండమని చెప్పడం మంచిదని తెలిపారు. మీ ఇంటికి వచ్చే, వెళ్ళే దారులు ఇంటిలోపల సీసీ కెమెరాలు అమర్చుకొని డీవీఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో పెట్టుకోవలన్నారు. అల్మరా, కప్ బోర్డ్స్ కు సంభందించిన తాళాలు కామన్ ఏరియా అయిన చెప్పుల స్టాండ్, పరుపులు దిండ్ల క్రింద, అల్మరా పైన, డ్రెస్సింగ్ టేబుల్ లో, కఫ్ బోర్డ్స్ లో ఉంచకుండా మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో పెట్టుకోవడం మంచిదన్నారు. బంగారు ఆభరణాలు వేసుకొని ఫంక్షన్ లకు, గుడికి వెళ్ళేటప్పుడు తగు జాగ్రతలు తీసుకోవలన్నారు. సోషల్ మిడియాలో మీరు బయటికి వెళ్ళే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడము మంచిది కాదన్నారు.



# కలెక్టర్ ని కలిసిన జడ్పిటిసి

**అలంపూర్ జనవరి 9 మరో ఉదయం న్యూస్:**

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బిఎం సంతోష్ ని వడ్డేపల్లి మండల జడ్పిటిసి కాశపోగు రాజు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ని సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు .మండల అభివృద్ధి కొరకు తమ వంతుగా కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోవెలదిన్నె శేఖర్ .జిల్లేడుదిన్నె ప్రకాష్ .రామాపురం లక్ష్మన్న .రవి గౌడ్ .వేముల నరేష్ .పెద్దదిన్నె కాశపోగు ప్రసంగి .పాల్గొన్నారు



# ఎంపి సీట్ల కోసం బిజెపి పక్కా వ్యూహం

## అయోధ్యను బాగా హైలెట్ చేసేలా ప్రచారం

**హైదరాబాద్,జనవరి10**

**(మరో ఉదయం):**

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేపీ అగ్రనేతలు మెజార్టీ సీట్లు సాధించడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు.పార్లమెంట్ ఎన్నికలో బీజేపీ అంతుచిక్కని వ్యూహంతో ముందుకు వెళ్లనున్నట్లు స్పష్టమవుతోంది. తెలంగాణలో మెజారిటీ ఎంపీ సీట్లు గెలుచుకునే దిశగా బీజేపీ అడుగులు వేస్తోంది. పదిహేడు స్థానాలకు ఇంచార్జిలను ప్రకటించి ఎన్నికల శంఖారావం మోగించిన కమల సేన వ్యూహం పై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పార్లమెంట్‌లో పది స్థానాలు పక్కాగా గెలవాలి అని టార్గెట్ పెట్టుకున్న బీజేపీ దానికి అనుగుణంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే ఇంచార్జిల అంశాన్ని బీజేపీ పెద్దలు చాల కీలకంగా తీసుకున్నారు. కాంగ్రెస అధికారంలో ఉండడతో పాటు, విపక్ష బిఆర్ఎస్ కూడా పోటీని తట్టుకుని ఎంపి సీట్లను గెల్చుకునే వ్యూహాలను అమలు చేయాలని చూస్తోంది. ప్రధానంగా అయోధ్యతో పాటు పలు జాతీయ అంశాలపై ఫోకస్ పెడుతోంది. అలాగే కాంగ్రెస్‌పైనా అప్పుడే విమర్శలను ఎక్కుపెడుతోంది. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను దృష్టిలో పెట్టుకొని ముఖ్య నాయకులకు బాధ్యతలు అప్పగించింది. అయితే 17 ఎంపీలకు ఇంచార్జిలను నియమించిన విధానం చూస్తే ఇంచార్జిలే అభ్యర్థులు అవ్వనున్నారా అనే అనుమనాం కూడా వస్తోంది. అన్ని సీట్లలో కాకపోయినా కొన్ని స్థానాల్లోనైనా ఇంచార్జిలకు సీట్లు ఇస్తారా అనే చర్చ పార్టీలో జోరందుకుంది. ఇక ఎంపీ స్థానానికి కూడా పార్టీలో డిమాండ్ నెలకొంది. ఒక్కో సీట్ కోసం ఏకంగా ముగ్గురు నుంచి నలుగురు ఆశావాహులు ఢిల్లీ స్థాయి నుంచి పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సిట్టింగ్ ఎంపీలతో పాటు సీనియర్ నాయకులు కూడా సీట్ల కోసం పోటీ పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 8 మంది ఎమ్మెల్యేలతో పాటు మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు ఎంపీ లక్ష్మణ్ కూడా ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వారికి బాధ్యతలు ఇవ్వడం వల్ల ఉపయోగం ఉంటుందని భావిస్తున్నారు. ఎమ్మెల్యేలుగా తాము అవలంబించిన గెలుపు వ్యూహాన్ని ఎంపీ ఎన్నికల్లో ఉపయోగిస్తారన్న ఆలోచలో అధిష్టానం ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా ఎక్కడ ఇబ్బందులు రాకుండా ప్రచారంతో పాటు పోల్ మేనేజ్ మెంట్ పక్కాగా ఉంటుందని బీజేపీ ముఖ్య నాయకులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే వారికి ఇంచార్జి బాధ్యతతలు ఇచ్చినట్లు తెలుస్తోంది. గెలిచిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలతో పాటు మాజీలు అందరికీ తమ సొంత పార్లమెంట్ నియోజవర్గ బాధ్యతలు అప్పటించారు. దీనివల్ల అసెంబ్లీ నియోజక వర్గాలను ప్రభావితం చెయ్యడంతో పాటు పక్క నియోజవర్గాలను కూడా కోఆర్డినేట్ చేసుకోవచ్చునేది పార్టీ అగ్ర నేతల వ్యూహంగా తెలుస్తోంది. నాలుగు సీట్లను గతంలో గెల్చుకోగా మోడీ ఛరిష్మాతో మరో 8 సీట్లను ఖాతాలో వేసుకోవాలని చూస్తోంది. అయోధ్య అంశాన్ని బాగా ప్రచారం చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇదే తమను గట్టెక్కించగలదని నేతలు భావిస్తున్నారు.

# జోగుళాంబ ఆలయ అభివృద్ధికి కేంద్ర సహాకారం

**(అలంపూర్ జనవరి 9 మరో ఉదయం న్యూస్ )**

రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను మంగళవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టరుఅపూర్వ చౌహాన్,ఆర్డీఓ చంద్రకళ, ఆలయ ఈఓ పురేందర్ కుమార్,చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ పూర్ణకుంబంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేయాగా ఆలయ ఈఓ చైర్మన్ లు శేషవస్త్రాలు.అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.పూజా కార్యక్రమం అనంతరం ఇక్కడి ప్రాంతం విశిష్టతను అడిషనల్ కలెక్టరు కేంద్రమంత్రికి వివరించారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇక్కడి ఆలయాలలో చేపట్టాల్సిన అభివృద్ధిపై దేవస్థానం వారు నివేధికను డీపిఆర్ రూపం లో అందజేస్తే సంబంధిత శాఖ మంత్రి కిషన్ రెడ్డి ద్వారా ఇక్కడి ఆలయాల అభివృద్ధి కి కేంద్ర సహకారాన్ని అందజేస్తామన్నారు.అలాగే తనకు అంగన్ వాడీ,ఆశా వర్కర్లు అంటే ఎనలేని గౌరవమన్నారు.వారు అత్యంత తక్కువ వేతనాన్ని పొందుతూ అత్యధిక సేవలను అందిస్తుంటారని కొనియాడారు. వారి సేవలను దృష్టిలో ఉంచుకుని వేతన పెంపునకు పునసమీక్షకు చొరవచూపుతామన్నారు. కార్యక్రమంలో సిఐ రాజు,తహాశీల్దార్ మంజుల,బిజేపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి.స్థానిక వైద్య బృందం తదితరులు ఉన్నారు.



# ఆధ్యాత్మిక నగరిగా అయోధ్య

## -దీపావళి వెలుగుల్లా ప్రతిష్టాపన -భారీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టిన పోలీసులు

## -ఏటా ప్రతిష్టాపన చేపడతామన్న సిఎం యోగి


**అయోధ్య,జనవరి10**

**(మరో ఉదయం):**

అంతారామమయం..ఈ జగమంతా రామమయం అన్నట్లుగా అయోధ్య సర్వాంగ సుందరంగా..ఆధ్యాత్మిక నగరంగా రూపుదిద్దుకుంటోంది. ఎక్కడ చూసినా రామాయణం తాండవిస్తోంది. 22న ఆలయ ప్రతిష్టాపనకు చురుకుగా ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి. అయోధ్యలో అడుగుపెట్టగానే ఆధ్మాత్మిక వాసనలు కనిపిస్తున్నాయి. అయోధ్యలో ఈనెల 22న నూతన రామాలయంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఈ నేపధ్యంలో మున్ముందు అయోధ్యలో అనేక అభివృద్ధి పనులు జరగనున్నాయి. తాజాగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ విలేకరుల సమక్షంలో అయోధ్యలో అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అయోధ్యలో సెవెన్ స్టార్ హోటల్ నిర్మిస్తామని, దానిలో శాకాహారం అందిస్తామని యూపీ సీఎం యోగి తెలిపారు. అలాగే ప్రతీయేటా అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ ఉత్సవం నిర్వహిస్తామని అన్నారు. ఎప్పుడో పదేళ్ల క్రితమే జరగాల్సిన ఉత్సవం ఇప్పుడు జరుగుతోందని అన్నారు. ఈ నెల 22న అయోధ్యలో జరిగే ఉత్సవం వెలుగుల పండుగ దీపావళి లా ఉంటుందని అన్నారు. అయోధ్యలో హోటళ్ల ఏర్పాటుకు సంబంధించి 25కు పైగా ప్రతిపాదనలు వచ్చాయన్నారు. వాటిలో ఒకటి కేవలం శాకాహారం అందించే సెవెన్ స్టార్ హోటల్ అని తెలిపారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానిక అధికారులతో చర్చించామని అన్నారు. అయోధ్యకు దేశంలోని నలుమూలల నుంచి రోడ్డు, విమాన, రైలు కనెక్టివిటీ ఏర్పడిందన్నారు. వీధి వ్యాపారుల వ్యాపార నిర్వహణ కు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. అయోధ్యలో గ్రీన్ కారిడార్ నిర్మిస్తామని, రామభక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గత రామనవమికి ఐదు లక్షల మంది భక్తులు అయోధ్య కు వస్తారని అంచనా వేయగా, ఆ సంఖ్య 35 లక్షలు దాటిందని ముఖ్యమంత్రి తెలిపారు. అయోధ్యకు వచ్చే రామభక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ క్రమంలో ఈ నెల 22న జరగనున్న అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా.. అయోధ్య విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం భారీగా భద్రత పెంచింది. 150 మందికి పైగా సిబ్బందిని సీఐఎస్ఎఫ్ యాంటీ టెర్రరిస్ట్ కవర్‌ను మంజూరు చేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలో 68 వ విమానాశ్రయ టెర్మినల్‌గా మారింది. 2023 డిసెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన అయోధ్య విమానాశ్రయా నికి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) భద్రత అందించనుంది. ప్రయాణికులు రాకపోకలు సాగించే ఎయిర్ గేట్‌వే సదుపాయానికి ముప్పు ఉన్న నేపథ్యంలో ఎయిర్ పోర్టుకు భద్రత కల్పిస్తున్నట్లు సీఐఎస్ఎఫ్ వెల్లడించింది. ప్రారంభోత్సవం సందర్భంగా దేశ విదేశాల నుంచి పలువురు రానున్నందున అయోధ్యలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎయిర్ పోర్టు కు సెక్యూరిటీ కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే ఈ సంఖ్యను మరింత పెంచుతామన్నారు. మొదటి దశలో, విమానాశ్రయం 65,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంటుంది. గంటకు రెండు నుంచి మూడు విమానాలు రాకపోకలు సాగించేలా నిర్మించారు. బోయింగ్ 737, ఎయిర్‌బస్ 319, 320 ఈ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. రెండో దశలో రన్‌వే పొడవు 2,200 మీటర్ల నుంచి 3,700 మీటర్లకు పెరుగుతుంది. తద్వారా బోయింగ్ 787, బోయింగ్ 777 వంటి అంతర్జాతీయ విమానాలు అయోధ్యలో ల్యాండ్ అవుతాయి. 50,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఎయిర్ పోర్టు విస్తరించి ఉంటుంది.

# గొర్లకు వైద్య పరీక్షలు వడ్డేపల్లి

**(అల్లంపూర్ జనవరి 9 మరో ఉదయం న్యూస్ )**




వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకల గ్రామానికి గతంలో వచ్చిన కేసీఆర్ గొర్రెల యూనిట్లను మండల పశు వైద్యాధికారులు మంగళవారం అకస్మాత్తుగా తనిఖీ చేసి ఆరోగ్యంగా ఉన్న గొర్రెలకు లివర్ టానికులు ఆకలి మందులు మినరల్ విటమిన్ మందులు వేశారు. లబ్ధిదారులకు తగు జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ. గొర్రెల సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. గొర్రెలు మేకల మాంసం ఉత్పత్తిలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ పి వరప్రసాద్ .లతీఫ్ .సర్పంచి బతకన్న. ఎస్ఓ రవి .గొర్రెల కాపర్లు .గ్రామస్తులు పాల్గొన్నారు.




# హాయ్ నాన్నా సినిమా చూసిన జాన్వీ

## మృణాల్ ఠాకూర్ నటనకు ఫిదా



దేవర' తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోన్న అతిలోక సుందరి శ్రీదేవి తనయ జాన్వీ కపూర్ తాజాగా.. తన ఇన్‌స్టా వేదికగా 'హాయ్ నాన్న' సినిమాపై స్పందించింది. రీసెంట్‌గా 'హాయ్ నాన్న' చిత్రం ఓటీటీలో విడుదల కాగా,ఈ సినిమాని చూసిన జాన్వీ కపూర్.. ఇన్‌స్టా వేదికగా సినిమాపై పొగడ్తల వర్షం కురిపించింది. మరీ ముఖ్యంగా మృణాల్ ఠాకూర్ నటనకు ప్రేమలో పడిపోయా నంటూ ఆమె చెప్పు కొచ్చింది. అలాగే దర్శకుడు, చిత్ర హీరో నేచురల్ స్టార్ నాని గురించి కూడా ఆమె గొప్పగా చెప్పు కొచ్చింది.నాని, మృణాల్ ఠాకూర్ ఉన్న పోస్టర్ షేర్ చేసిన జాన్వీ కపూర్.. మృణాల్ నీ నటనకు ప్రేమలో పడిపోయా. మొదటి ప్రయత్నంలోనే మనుసుని హత్తుకునే చిత్రాన్ని రూపొందించిన శౌర్యువ్‌కు కృతజ్ఞతలు. నాని.. ఎప్పటిలాగే చాలా గొప్పగా నటించారని, తన ఇన్‌స్టా స్టోరీస్‌లో చెప్పుకొచ్చింది. జాన్వీ కపూర్ చేసిన ఈ పోస్ట్‌పై చిత్ర నిర్మాణ సంస్థ వైరా ఎంటర్‌టైన్‌మెంట్ స్పందిస్తూ... 'మీ ప్రశంసలు మాకెంతో విలువైనవి' అని సంతోషాన్ని వ్యక్తం చేసింది. ప్రస్తుతం జాన్వీ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నేచురల్ స్టార్ నాని హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'హాయ్ నాన్న' మ్యాజికల్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించింది. వైర ఎంటర్ టైన్‌మెంట్ మొదటి ప్రొడక్షన్ వెంచర్‌గా రూపొందిన ఈ చిత్రంతో శౌర్యువ్ దర్శకునిగా పరిచయమయ్యారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించగా, బేబీ కియారా ఖన్నా మరో కీలక పాత్రలో కనిపించింది. ఈ చిత్రాన్ని మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. డిసెంబర్ 7న గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి ఘన విజయాన్ని సాధించింది. రీసెంట్‌గానే ఈ చిత్రం నెట్‌ప్లిక్స్ ఓటీటీలో విడుదలై.. అక్కడ కూడా మంచి ఆదరణను చూరగొంటోంది.

# హిందీ నేర్చుకోవద్దని ఎవరూ అనలేదు

## మెర్రీ క్రిస్మస్ చిత్ర ప్రమోషన్‌లో విజయ్ సేతుపతి

రాష్ట్రంలో హిందీని నేర్చుకోవద్దని ఎవరూ చెప్ప లేదని, బలవంతంగా రుద్దవద్దని మాత్రమే అంటున్నారని నటుడు 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి అన్నారు. ఆయన హీరోగా నటించిన 'మెర్రీ క్రిస్మస్' చిత్రం ప్రమోషన్‌లో భాగంగా చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన హిందీ లాంగ్వేజ్‌పై జరుగుతున్న కాంట్రవర్సీపై మాట్లాడారు. నాకు కొంతమేర మాత్రమే హిందీలో మాట్లాడటం తెలుసు. ఐదు హిందీ చిత్రాల్లో నటించా. తమిళనాడులో హిందీని నేర్చుకోవద్దని ఎవరూ చెప్పడం లేదు. బలవంతంగా రుద్దవద్దని మాత్రమే చెబుతున్నారు. ఇక్కడ అనేక మంది హిందీని అభ్యసిస్తున్నారు. వీరిపై ఎవరి ఒత్తిడి లేదు. ఈ విషయం గురించి మంత్రి పళనివేల్ త్యాగరాజన్ గతంలో వివరించారు. ఇక్కడ ఈ ప్రశ్న అసందర్భం. ఓటీటీలు అందుబాటులోకి వచ్చిన తర్వాత భాషా సరిహద్దులను అభిమానులు చూడటం లేదు. నా కుమారుడు సూర్య హీరోగా పరిచయమవుతూ నటిస్తున్న తొలి చిత్రం 'ఫీనిక్స్'. మా గురించి బయట చెప్పుకోవద్దని మేం నిర్ణయం తీసుకున్నాం. అందుకే నా కుమారుడి చిత్ర ప్రారంభోత్సవ పూజకు వెళ్లలేదని విజయ్ సేతుపతి పేర్కొన్నారు. విజయ్ సేతుపతి, బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్ జంటగా నటించిన 'మెర్రీ క్రిస్మస్' చిత్రానికి శ్రీరామ్ రాఘవన్ దర్శకుడు. టీను ఆనంద్, సంజయ్‌కపూర్, వినయ్ పాథక్, ప్రతిమా ఖన్నన్, రాధికా ఆప్టే, అశ్విన్ ఖల్సేకర్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. రమేష్ తారణి, సంజయ్ రౌత్రే, జయ తారణి, కెవల్ గార్గ్ నిర్మాతలు. ఈనెల 12వ తేదీన సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తమిళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



# మహేశ్‌తో సినిమా మాజిగా ఉంటుంది

## ప్రీరిలీజ్ ఈవెంట్‌లో త్రివిక్రమ్ శ్రీనివాస్




సూపర్ స్టార్ మహేష్ బాబు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ముచ్చటగా మూడోసారి తెరకెక్కిన చిత్రం 'గుంటూరు కారం' పై భారీగా అంచనాలున్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ(చినబాబు) ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను నిర్మించారు. భారీ అంచనాల నడుమ సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం గుంటూరులోని నంబూరు క్రాస్ రోడ్స్‌లో అభిమానుల కోలాహలం నడుమ ప్రీ రిలీజ్ వేడుకను గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక నిమిత్తం గుంటూరు రావడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి ఈ సినిమా పేరు 'గుంటూరు కారం'. రమణగాడు మీ వాడు, మనందరి వాడు. అందుకని మీ అందరి మధ్యలో ఈ ఫంక్షన్ చేయాలని అనుకున్నాం. చాలారోజుల షూటింగ్ తర్వాత విపరీతంగా అలిసిపోయి కూడా మీ అందరినీ కలవడం కోసం గుంటూరుకి వచ్చారు. రెండో కారణం.. సూపర్ స్టార్ కృష్ణ గారు తెలుగు సినిమాలో విడదీయలేని ఒక అంతర్భాగం. అలాంటి ఒక గొప్ప మహానటుడు, ఒక గొప్ప మనిషితో నేను సినిమా చేయలేదు కానీ, ఆయన నటించిన ఒక సినిమాకి పోసానిగారి దగ్గర అసిస్టెంట్ రైటర్‌గా పనిచేశాను. ఆయనతో డైరెక్ట్‌గా పరిచయం కలిగినటువంటి సందర్భం అదొక్కటి మాత్రమే. ఆ తర్వాత నేను 'అతడు, ఖలేజా' సినిమాలు తీసినప్పుడు ఆయనతో మాట్లాడటం, ఆయనతో గడిపిన ప్రతిక్షణం కూడా నాకు చాలా చాలా అపూర్వమైనది, అమూల్యమైనది. అంత గొప్ప మనిషికి పుట్టినటువంటి మహేష్‌గారు ఇంకెంత అదృష్టవంతుడు అని అప్పుడప్పుడు అనిపిస్తూ ఉంటుంది. ఒక్క సినిమాకి వందశాతం పని చేయాలంటే.. రెండొందల శాతం పనిచేసే హీరో ఎవరైనా ఉన్నారా అంటే అది మహేష్ గారు. ఇది చెప్పడంలో మాత్రం తెలుగు ఇండస్ట్రీలో ఎవ్వరూ కూడా వెనక్కి తిరిగి చూడరు. నేను 'అతడు' సినిమాకి పని చేసినప్పుడు ఎలా ఉన్నారో, 'ఖలేజా'కి పని చేసినప్పుడు ఎలా ఉన్నారో ఈరోజు కూడా ఆయన అలాగే ఉన్నారు. పాతిక సంవత్సరాలైంది అంటున్నారు కానీ, నాకు మాత్రం నిన్న మొన్న పరిచయమైన హీరోలాగే కనిపిస్తున్నారు. చూడటానికి అంత యంగ్‌గా ఉన్నారు. మనసులోనూ అంతే యంగ్‌గా ఉన్నారు. పర్ఫామెన్స్‌లో కూడా అంతే నూతనంగా, అంతే యవ్వనంగానే ఉన్నారు. ఆయనకు మరిన్ని వసంతాలు ఉండాలని, కృష్ణగారి తరపున మీరందరూ ఆయన వెనక ఉండాలని, ఆయన్ని ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ జనవరి 12న థియేటర్లలో కలుద్దాం. ఈ సంక్రాంతిని చాలా గొప్పగా జరుపుకుందాం. ఆనందంగా జరుపుకుందాం. రమణగాడితో కలిసి జరుపుకుందాం..' అని అన్నారు.

# ఫిబ్రవరిలోనే భైరవకోన విడుదల

టాలీవుడ్ సందీప్ కిషన్ హీరోగా నటిస్తోన్న చిత్రం ఊరు పేరు భైరవకోన. వీఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నాడు. వర్ష బొల్లమ్మ ఫీమేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. అయితే ఇదే సమయంలో రజినీకాంత్ నటించిన లాల్ సలామ్, రవితేజ నటించిన ఈగల్ సినిమాలు విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో సందీప్ కిషన్ సినిమా విడుదల ఆలస్యమవుతుందంటూ వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. అయితే ఈ వార్తలకు ఫుల్ స్టాప్ పెడుతూ ఊరు పేరు భైరవకోన అనుకున్న సమయానికే విడుదలవుతుందంటూ క్లారిటీ ఇచ్చేశాడు సందీప్ కిషన్. పోస్టర్‌ను షేర్ చేస్తూ ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేశాడు సందీప్ కిషన్. ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. విడుదలకు ముందే ఫస్ట్ సింగిల్ నిజమే నే చెబుతున్నా లిరికల్ వీడియో సాంగ్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తూ.. మ్యూజిక్ లవర్స్ మనసు దోచేస్తోంది. ఈ ఒక్క సాంగ్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. మరోవైపు రెండో సింగిల్ హమ్మ హమ్మ సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్ మెంట్స్ అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. టైగర్ తర్వాత సందీప్ కిషన్, వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. ఈ సారి ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో వస్తున్న వీఐ ఆనంద్ ప్రేక్షకులను ఎలా ఇంప్రెస్ చేస్తాడని ఎక్జయిటింగ్‌గా చూస్తున్నారు.




Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com